క్లుప్తంగా

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి


సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: అరకులోయ సర్కిల్ పరిధిలోగల అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పరిధిలో వినాయక చవితి వేడుకలకు మండపాల ఏర్పాటులకు పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ హిమగిరి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ దీపాలంకరణలో జాగ్రత్తలు పాటించాలని, ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు.

2న వైఎస్సార్ వర్ధంతి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో ఈనెల 2వ తేదీన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ రంజపల్లి ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు హజరు కానున్నట్టు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ జంక్షన్ నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

చిత్తడి దారితో అవస్థలు


అన్నవరం మెట్టువీధి రోడ్డు దుస్థితి

గూడెంకొత్తవీధి: వర్షాలకు మన్యంలోని రహదారులు మరింత దయనీయంగా మారుతున్నాయి. గూడెంకొత్తవీధి మండలంలోని మారుమూల ఉన్న గుమ్మిరేవుల పంచాయతీలోని అన్నవరం మెట్టువీధి గ్రామానికి సరైన రహదారి లేదు. గతంలో వేసిన మట్టిరోడ్డు వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ మార్గం దుర్భంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని మెట్టువీధి గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పాడేరు ఎమ్మెల్యేను కలిసిన ఆదివాసీ నాయకులు


ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును కలిసిన నాయకులు

గంగవరం: పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వర రాజును శనివారం పాడేరులో మర్యాదు పూర్వకంగా కలిసినట్లు గంగవరం వైఎస్సార్ సీపీ నాయకులు కుంజం సత్యవతి, ఆదివాసీ సంఘీభావం సమితి రాష్ట్ర కన్వీనర్ పండా సిద్దార్థదొరలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేశామన్నారు. గిరిజనుల సమస్యలపై పార్టీ పరంగా పరిష్కారానికి కృషి చేయాలని కోరామన్నారు.

ఘాట్ రోడ్డులో కోళ్ల వ్యాన్ బోల్తా


మృతి చెందిన కోళ్లు

చింతపల్లి: నర్సీపట్నం నుంచి ఏజెన్సీకి తరలిస్తున్న బాయిలర్ కోళ్ల వ్యాన్ బోల్తా పడింది శనివారం సాయంత్రం డౌనూరు సమీపంలో తురబార గడ్డ మొదటి మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. మైదాన ప్రాంతం నుంచి చిత్రకొండ తరలిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో వ్యాన్‌లో తరలిస్తున్న మొత్తం కోళ్లను మృత్యువాత పడ్డాయి. అదే సమయంలో ఘాట్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులతో పాటు స్థానికులు అక్కడికి చేరుకొని చనిపోయిన కోళ్లను పట్టుకుపోయారు. అయితే వాటిని నిల్వ ఉంచుకొని తినే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన సంఘటనకు సంబంధించి చనిపోయిన కోళ్లను తీసుకు వెళ్లిన ఆయా గ్రామాల్లో గిరిజనులకు ఆరోగ్య పరిస్థితులపై అవగాహన పరచాల్సిన అవసరం ఉందని పలువురు చెబుతున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099
సాక్షి


టేకులబోరు నుంచి కొండ్రాజుపేటకు పనుల కోసం వెళ్తున్న కూలీలు


గోతులమయంగా దర్శనమిస్తున్న కొండ్రాజుపేట రహదారి

దారులు ఇలా.. ప్రయాణం ఎలా ?

- అధ్వానంగా టేకులబోరు-కొండ్రాజుపేట రహదారి
- చిత్తడి దారితో పెరుగుతున్న ప్రమాదాలు
- ఆందోళనలో వాహనచోదకులు


ఎత్తు పెంచాల్సిన కొండ్రాజుపేట కాజ్‌వే ఇదే..


చిత్తడిగా మారిన టేకులబోరు-కొండ్రాజుపేట రహదారి

కూనవరం: కొండ్రాజుపేట నుంచి టేకులబోరు రహదారి అధ్వానంగా మారింది. గత నెల జూలైలో సంభవించిన గోదావరి వరదలకు ఆ రహదారి పూర్తిగా దెబ్బతింది. పది రోజులకు పైగా వరదనీరు రోడ్డుపైన నిల్వ ఉండడంతో పెద్ద పెద్ద గోతులు పడి, మోకాళ్ల లోతుపైగా సిల్ట్ (ఊబి) పేరుకు పోయింది. ఆ సిల్ట్ తొలగించే నాథుడే లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షం వస్తే చాలు ఆ రోడ్డుపై నడకే నాట్యంగా మారుతుంది. ఆ రోడ్డుపై వెళ్లే ద్విచక్రవాహనచోదకులు అనేక సార్లు ప్రమాదానికి గురయ్యారు. ఈ దారి మీదుగా వెళ్లాలంటే వణుకు పుడుతుందని వాహనచోదకులు చెబుతున్నారు. వ్యవసాయ కూలీలకు, రైతులు ఈ రహదారి తప్ప మరో గత్యంతరం లేదు. రోజుకు సుమారు రెండు వేలమంది ప్రజలు ఆ రోడ్డు మీదుగా పొలాలకు వెళ్తుంటారు. మండలంలోని కొండ్రాజుపేట, శబరికొత్తగూడెం, వాల్ఫర్డుపేట, పూసుగ్గూడెం, కొత్తూరు, వెంకన్నగూడెం, శ్రీరాంపురం, జిన్నెలగూడెం తదితర గ్రామలకు చెందిన గిరిజనులు మండల కేంద్రానికి నిత్యం ఇదే మార్గం గుండా వస్తుంటారు. ఇదే ఈమార్గం. ఇంతటి ప్రాదాన్యత ఉన్న రహదారిని సదరు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

రెండు పంచాయతీల మధ్య నిర్లక్ష్యానికి గురవుతున్న రోడ్డు కూనవరం, కొండ్రాజుపేట గ్రామ పంచాయతీల మధ్య నున్న ఈ రహదారిని గతంలో జిల్లా పరిషత్ నిధులతో మెటల్ రోడ్డుగా నిర్మించారు. ఏటేటా వచ్చే గోదావరి వరదలకు ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కనీసం రోడ్డుపైన పేరుకు పోయిన సిల్ట్‌ను తిలగించేందుకు అధికారులు సైతం ముందుకు రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇటు కూనవరం మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు, అటు కొండ్రాజుపేట గ్రామ పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది.

పలుమార్లు వినతులిచ్చాం



కొండ్రాజుపేట నుంచి టేకులబోరు రోడ్డు మరమ్మతుల చేపట్టాలని చింతూరు ఐటీడీఏ పీఓకి పలుమార్లు దరఖాస్తులు ఇచ్చాను. స్థానిక మండల పరిషత్ సమావేశాల్లో టేకులబోరు నుంచి జిన్నెలగూడెం వరకు మరమ్మతులు చేపట్టాలని తీర్మాణం చేసి కలెక్టర్‌కు పంపాం. జెడ్పీ సమావేశాల్లోను ప్రస్తావించాను. నేటి వరకు అధికారులు స్పందించలేదు. తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలి.

–పాయం రంగమ్మ, ఎంపీపీ, కూనవరం

అధికారులు స్పందించాలి



వరదలు వచ్చినా.. వర్షం వచ్చినా కొండ్రాజుపేట రోడ్డుపై ప్రయాణం అంటే వణుకు పుడుతుంది. వ్యవసాయ పనులు ప్రారంభమైతే నిత్యం ఆ రహదారి రద్దీగా ఉంటుంది.చిత్తడి దారి వల్ల ద్విచక్రవాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొండ్రాజుపేట కాజ్‌వే ఎత్తు పెంచి తారురోడ్డు వేస్తేనే కష్టాలు తీరుతాయి. అధికారులు స్పందించాలి.

– కట్టం లక్ష్మి, సర్పంచ్, కొండ్రాజుపేట

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని టేకులబోరు నుంచి చట్టి గ్రామం వరకు సుమారు 22 కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మాణానికి రూ.40.5 లక్షల వ్యయంతో పనుల కోసం ప్రతిపాదనలు పంపాం.దీంతో పాటు టేకులబోరు నుంచి కొండ్రాజుపేట వరకు రూ.15 లక్షల వ్యయంతో సుమారు 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు, మిగిలిన 17 కిలోమీటర్లు రూ.25 లక్షలతో మెటల్ గ్రావెల్ రోడ్డుకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం.

– దుర్గాప్రసాద్, డీఈఈ, పంచాయతీరాజ్

ప్రమాదభరితంగా జాతీయ రహదారి


లక్ష్మీపురం వద్ద ప్రమాదభరితంగా ఉన్న జాతీయ రహదారి పనులు

ఎటపాక: జాతీయ రహదారి ప్రమాదభరితంగా మారింది. విస్తరణ పనుల్లో భాగంగా ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీపురంలో సెల్‌టవర్ వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టారు. అయితే కల్వర్టు కాంక్రీట్ పనులు పూర్తిచేసినప్పటికీ రహదారి సగభాగం కాంక్రీట్‌పై మట్టి నింపకుండా వదిలేశారు. జాతీయరహదారి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పనుల్లో నిర్లక్ష్యం చోటుచేసుకుంటుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా చింతూరు నుంచి భద్రాచలం వెళ్లే ఈ రహదారిపై వాహనదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారిలో చత్తీస్‌గడ్, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుంచి భారీ వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. రహదారి నిర్మాణ పనుల ప్రాంతంలో కూడా ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండడంతో ఉన్న కొద్ది రహదారి కూడా కోతకు గురవుతుందని భయాందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆత్మీయ సన్మానం


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు బేబివైనింగ్ సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గంగవరం: మండలంలోని పెద్ద అడ్డపల్లి ఎంటీఎస్ ఉపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన బేబివైనింగ్‌ను హెచ్‌ఎం సునీతకుమారి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సునీతకుమారి మాట్లాడుతూ ఎంటీఎస్ ప్రాతిపదికన నియామకం పొంది ఉపాధ్యాయురాలుగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బేబివైనింగ్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అడ్డపల్లి గ్రామంలో పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్ సువర్ణకుమారిని సన్మానించారు. యూటీఎఫ్ అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి వెంకటేశ్వరావు, నాయకులు రుక్మిణి, బొజ్జిదొర, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిపుట్టులో వంతెన నిర్మించాలి


కుమ్మరిపుట్టు వద్ద గిరిజనులకు తాడును అందిస్తున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతమైన కుమ్మరిపుట్టు గ్రామం వద్ద రాకపోకల కోసం వంతెనను ప్రభుత్వం, అధికారులు స్పందించి మంజూరు చేయాలని సుజనకోట పంచాయతీ సర్పంచ్ వి.రమేష్ డిమాండ్ చేశారు.కుమ్మరిపుట్టు గ్రామం వద్ద నాటు పడవల దాటేందుకు వీలుగా పంచాయితీ నిధులతో 150 మీటర్ల తాడుని ఆయన శనివారం స్థానికులకు అందించారు. తాడును మత్స్యగెడ్డకు ఇరువైపులా కట్టి దాని సహాయంతో ఎంతో సురక్షితంగా గెడ్డ దాటాలని గిరిజనులను ఆయన కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ సుజనకోట పంచాయతీలో 13గ్రామాల గిరిజనులు నిత్యం కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డ వద్ద నాటు పడవలపై ప్రమాదకర పరిస్థితుల్లో గెడ్డ దాటుతున్నారన్నారు. కుమ్మరిపుట్టు వద్ద వంతెనను నిర్మిస్తే రాకపోకలకు మార్గం సుగమం అవుతుందన్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు వినతులు అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కుమ్మరిపుట్టులో మత్స్యగెడ్డపై వంతెనను మంజూరు చేయాలని ఆయన కోరారు. ఐటీడీఏ నుంచి ఫైబర్ బోట్లు సైతం అందించాలని ఆయన కోరారు.

ఇంటికో చెట్టు..ఊరంతా వనం


జీకే వీధిలో మొక్కలు నాటుతున్న ఐసీడీఎస్ పీవో లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు, సిబ్బంది


కొయ్యూరులో మొక్కలు నాటుతున్న సీడీపీవో విజయకుమారి

గూడెంకొత్తవీధి: ఇంటికో మొక్కనాటితే ఊరంతా వనమై పచ్చదనం పెంపొందుతుందని చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీదేవి అన్నారు. మండల కేంద్రంలో ఆమె మొక్కల నాటే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ, మినీ కేంద్రల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆమె కోరారు. పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు.. ఇంటింటా చెట్టు.. ఊరంతా పచ్చదనం అని నినాదాలు చేస్తూ విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు. ప్రాజెక్టు సూపర్‌వైజర్లు మోహిని, రామలక్ష్మి, కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: ముంచుకొస్తున్న పర్యావరణ ముప్పును ఎదుర్కోవాలంటే మొక్కలు నాటడమే కీలకమని సీడీపీవో విజయకుమారి అన్నారు. భూమి వేడెక్కకుండా ఉండేందుకు మొక్కలు కీలకంగా మారుతాయని చెప్పారు.ఆమె కార్యాలయంలో శనివారం మొక్కలు నాటారు. దీంతో పాటు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోను మొక్కలు నాటాలని ఆదేశాలు ఇవ్వడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ బాగుంటుందని సూచించారు. భూమి ఆరోగ్యంగా ఉండాలంటే ఎక్కువగా చెట్లు ఉండాలన్నారు. అవి లేకుంటే మానవాళి ప్రమాదంలో ఉంటుందన్నారు. ఇప్పటికే పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల మూలంగా వాతావరణం మార్పునకు గురైందన్నారు. సూపర్‌వైజర్ సునీత, బాలామణి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు అమలుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి సీసం సురేష్

చింతూరు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. చింతూరులో జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజలకు ఎన్నో ఉచిత హామీలు ప్రకటించినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు పరచకుండా కాలయాపన చేస్తోందని, రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ప్రతినెలా రూ 1,500, మూడు గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు ఇప్పట్లో అమలు చేయనట్టుగా ఉందని ఆయన విమర్శించారు. వలంటీరు వ్యవస్థను కొనసాగించడంతో పాటు వారికి హామీ ఇచ్చినట్టుగా రూ.10 వేలు వేతనం ఇవ్వాలని ఆయన కోరారు. నాయకులు వెంకట్, చిన్నయ్య, లక్ష్మణ్, రాజయ్య, నాగేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

చింతపల్లి: ఆదివాసీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆసక్తి చూపుతున్నారని, గిరిజన ప్రాంతాభివృద్ధిపై కనీసం శ్రద్ధ చూపడం లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి. సత్యనారాయణమూర్తి చెప్పారు. ఆయన శనివారం సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కనీస అవసరమైన రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాలకు విన్నవించుకున్నా పట్టించుపోకపోవడంతో నేటికీ అనేక గిరిజన మారుమూల ప్రాంతాల్లో రోగులు గర్భిణులు డోలీమోతల పైన ఆధారపడవలసి వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతంలో రోడ్డు సౌకర్యాల కల్పినకు చర్యలు తీసుకోవాలని కోరారు. శివారు గ్రామాల్లో గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పనలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోగా గిరిజన ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న బాక్సైట్‌ను తరలించేందుకు రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు రోడ్డు వేశారా అని ఘాటుగా విమర్శించారు.

ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ, విమల, వెంకటరమణ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం


జి.మాడుగులలో కురుస్తున్న వర్షం


పొంగి ప్రవహిస్తున్న పెదబయలు మత్స్యగెడ్డ

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఉరుములు, మెరుపులు, భీకర శబ్దాలతో పిడుగులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. దీంతో పాడేరు-జి.మాడుగుల, చింతపల్లి రోడ్డు మార్గం, నుర్మతి, బొయితిలి, సొలభం, గడుతూరు, వంజరి, గెమ్మెలి, కుంబిడిసింగి పెదలోచలి, వంతాలతో పాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై ముంచెత్తిన వరదనీటితో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పంటపొలాల్లో వర్షపునీరు చేరింది. మత్స్యగెడ్డ, కోడిమామిడి, ఈదులబయలు, మద్దివీధి తదితర గెడ్డలు వరదనీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. భీకర శబ్దాలతో పడిన పిడుగుల వలన స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

పెదబయలు: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో కుండపోత వర్షం కురుస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని మత్స్యగెడ్డతో పాటు గిన్నెలకోట, గుంజివాడ గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుండపోత వర్షానికి వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. ప్రస్తుతం వరి నాట్లు 95 శాతం పూర్తయింది. ప్రస్తుతం రాజ్‌మా సాగుకు సంబంధించి మెట్ట ప్రాంతాల్లో పనులను రైతులు ప్రారంభించారు.అయితే భారీ వర్షాల వల్ల జాప్యం జరుగుతుంది. భారీ వర్షాలతో వరి నాట్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల వల్ల మండల కేంద్రంలో గ్రంథాలయం వీధిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక వర్షనీరు నిలిచిపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా శనివారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. జనజీవనం పూర్తిగా స్తంభించింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో పలు చోట్ల కొండవాగుల నుంచి వచ్చిన వరద నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మండలంలోని అమ్మిరేఖల, లాగరాయి, లబ్బర్తి, శరభవరం కాలువల్లోకి భారీగా వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జడ్డంగిలోని మడేరు ఆనకట్ట, రాజవొమ్మంగిలోని వట్టిగెడ్డ జలాశయాల్లోకి వరద చేరడంతో పొర్లు మదుముల ద్వారా దిగువకు ప్రవహిస్తున్నాయి. రాజవొమ్మంగిలోని వారపు సంతకు వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. రాజవొమ్మంగిలో శుక్రవారం 5.6 ఎంఎం, శనివారం 24.6 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు స్టాటస్టికల్ ఆఫీసర్ మురళీకృష్ణ తెలిపారు. శనివారం సాయంకాలం పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు మెరుపులతో మరోసారి భారీ వర్షం కురిసింది.


పెదబయలు గ్రంథాలయం వీధిలో నిలిచిన వర్షపునీరు


రాజవొమ్మంగి నుంచి అమ్మిరేఖలలో ప్రవహిస్తున్న పెద్దేరు


కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. రహదారులన్నీ బురదమయ్యాయి. భారీ వర్షాలు కురవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారాం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్‌వోలను అప్రమత్తం చేశామన్నారు.

ఘాట్‌రోడ్డులో రాకపోకలు నిలిపివేత


ఘాట్ రోడ్డులో విరిగిపడిన బండరాళ్లను చూపిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి: చింతపల్లి మండలం లంబసింగి ఘాట్ రోడ్డులో భారీ వర్షాల కారణంగా రాత్రి 7 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్టు తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గడచిన రెండు రోజులుగా సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో లంబసింగి ఘాట్ రోడ్డులో కొండచరియలు జారిపడి రోడ్డు పైకి పెద్దపెద్ద బండరాళ్లు దొర్లి వచ్చాయని, ప్రయాణాలు ప్రమాదకరంగా మారిందన్నారు. రాత్రి సమయంలో వర్షాల కారణంగా కొండచరియలతో పాటు పెద్దపెద్ద వృక్షాలు సైతం నేలకొరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఈ మార్గంలో వాహనాల ప్రయాణాలు ప్రమాదకరంగా భావించి ఈ రాకపోకలను నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని వాహనచోదకులు గమనించాలని కోరారు.

గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ


వై.రామవరంలో అంధురాలికి పింఛన్ అందజేస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

వై.రామవరం/అడ్డతీగల: వై.రామవరం, అడ్డతీగల మండలాల్లో రంపచోవరడం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వై.రామవరం మండలంలోని యార్లగడ్డ, పి.యర్రగొండలో లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను అందజేశారు. అనంతరం ఆయన అడ్డతీగల మండలంలోని వేటమామిడిలో పర్యటించి, సామాజిక పింఛన్లను అందజేశారు. పింఛన్ల పంపిణీల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈవోపీఆర్డీ శివకుమార్, ఎంపీడీవో ఎ.రంగారావు, గ్రామకార్యదర్శి చాందినీ, బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో శనివారం సాయంకాలానికి సుమారు 90 శాతం పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తయినట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. మొత్తం 6, 413 పింఛనుదారులకు గాను 5,780 మందికి అందజేశామన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి ఆమె స్వగ్రామం అనంతగిరిలో శనివారం ఉదయం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com